క్లుప్తంగా

టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో మహిళలకు 3 నెలల పాటు ఉచితంగా టైలరింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం మేనేజర్ డీ సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 సంవత్సరాల మధ్య వయసు గల కనీసం 5వ తరగతి విద్యార్హత ఉన్న మహిళలు ఈ నెల 29వ తేదీ లోపు మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు ఇవ్వాలని సూచించారు.

ఎన్టీఆర్ శతజయంతి కవిత్వం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లూరి

ఒంగోలు టౌన్: ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని వంద మంది కవితలతో శత కవితా హేల అనే పుస్తకాన్ని ప్రచురించడం తన పూర్వజన్మ సుకృతమని ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు అన్నారు. నగరంలోని మల్లయ్యలింగం భవన్లో శనివారం ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు కవితా హేల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని సభకు అధ్యక్షత వహించిన నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అన్నారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సభలో పలువురు కవులను ఘనంగా సత్కరించారు. సాహితీవేత్తలు బెజవాడ వెంకట్రావు, తేళ్ల అరుణ, డాక్టర్ నూనె అంకమరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా పొన్నూరు



పొన్నూరు శ్రీనివాసులు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన పొన్నూరు శ్రీనివాసులును ఎంపిక చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా పొన్నూరు శ్రీనివాసులు చేస్తున్న విశేషమైన సాహిత్య సేవలను గుర్తించి ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు వివరించారు. సాహిత్య రంగంలో అవిశ్రాంత సేవలు అందిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం, గిడుగు విశిష్ట భాషా సేవా పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎంపికైన పొన్నూరుకు ప్రరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, కోశాధికారి కె.వి.రమణారెడ్డి అభినందనలు తెలిపారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు చేయూతనివ్వాలి

● కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీజీ)లు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ప్రకాశం భవన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎఫ్‌పీజీలపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ, జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖలు ఈ విషయంలో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఎఫ్‌పీజీలకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించేందుకు నిర్దిష్ట నిర్వహణ విధానాలను రూపొందించుకోవాలని ఆయా శాఖలను ఆదేశించారు. ఈ గ్రూపుల్లో వాస్తవ రైతులు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. సాగు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ విషయాల్లో అవసరమైన సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఎఫ్‌పీజీలు సంస్థాగతంగా బలోపేతం అయ్యేలా ప్రత్యేక క్యాలెండర్ ప్రకారం శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ గ్రూపులను పర్యవేక్షించేందుకు వివిధ విభాగాల అధికారులతో స్పెషల్ కోర్ గ్రూపు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, ట్రైనీ ఐఏఎస్ శౌర్య పటేల్, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపిచంద్, ఆత్మ పీడీ అన్నపూర్ణ, డీఆర్‌డీఏ పీడీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



నీటి సమస్యపై చర్చిస్తున్న ప్రణీత్‌రెడ్డి, కమిషనర్, 16వ డివిజన్ ప్రజలు

● బాలినేని ప్రణీత్‌రెడ్డిని కోరిన 16వ డివిజన్ ప్రజలు

ఒంగోలు: నగరంలోని 16వ డివిజన్‌లో శనివారం వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ వాసులు తాము ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రణీత్‌రెడ్డి.. నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావుతో మాట్లాడి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. పైపులైన్ ఎస్టిమేషన్ సిద్ధం చేసి టెక్నికల్ శాంక్షన్ కోసం పంపామని కమిషనర్ తెలిపారు. 2 నెలల్లో పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ప్రజలకు వారు వివరించారు. ప్రస్తుతం ఉన్న టర్న్‌కాక్ తమకు నీటి సరఫరా సమాచారం ఇవ్వడం లేదని ప్రజలు తెలుపగా, టర్న్‌కాక్‌ను వెంటనే మారుస్తామని హామీ ఇచ్చారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్‌కు బాలినేని ప్రణీత్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ యోజనకు ఈకేవైసీ చేయించుకోవాలి

మద్దిపాడు: మండలంలోని రైతులు పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా లబ్ధిపొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.రమేష్ తెలిపారు. సమీపంలోని మీ సేవా కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లు లేదా ఆర్‌బీకేల వద్ద ఉండే వీఏఏల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈకేవైసీ చేయించని పక్షంలో వారికి పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా వచ్చే డబ్బు జమకాదని స్పష్టం చేశారు. అందువలన రైతులంతా వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల ఖాతాలకు డబ్బు జమ చేయనున్నారని ఆయన తెలిపారు. మండలంలో ప్రస్తుతం అర్హత కలిగిన రైతులు 5,585 మంది ఉన్నారని, వారికి రూ.3,07,17,500 వ్యక్తిగత ఖాతాలకు జమవుతుందని తెలిపారు. ఈ పథకానికి అర్హత పొందిన రైతుల లిస్టు అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏల వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు ఆ జాబితాలో వారి పేర్లను సరి చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పేస్ కాలేజీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ మొదటి గ్రాడ్యుయేషన్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ యువ ఇంజినీర్లు సరైన కెరీర్‌ను ఎంచుకునేందుకు, అవసరమైన నైపుణ్యాభివృద్ధికి ఎడ్యుస్కిల్స్, స్మార్ట్ ఇంటర్న్ వంటి ప్రఖ్యాత సంస్థలతో ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ ఉచిత ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఏపీఎస్‌సీహెచ్‌ఈ అందిస్తుందని తెలిపారు. యువ ఇంజినీర్ల నైపుణ్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. జేఎన్‌టీయూ కాకినాడ అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల నిబద్ధతను కొనియాడారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐటీ, మెకానికల్, ఆటోమొబైల్, సివిల్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ సహా వివిధ శాఖలకు చెందిన 900 మంది బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ముఖ్యఅతిథులు డిగ్రీలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా 33 ప్రసిద్ధ సంస్థలలో అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లలో 90 శాతం మంది ఉన్నత ఉద్యోగాలు సాధించారని, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ రూప అక్కేష్ తెలిపారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పేరుతో మున్సిపాలిటీ నూతన భవనం

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీ నూతన కార్యాలయ భవనానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టనున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఈ నెల 31న నిర్వహించనున్న మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్ల ఏకగ్రీవ తీర్మానాలతో నూతన కార్యాలయానికి వైఎస్సార్ పేరు పెట్టేందుకు ఆమోదించనున్నట్లు అజెండాలో తెలిపారు. బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించే నిధులతో మున్సిపల్ నూతన కార్యాలయ భవనం ఎంట్రెన్స్ గేటు, ఆర్చి నిర్మించేందుకు కూడా ఆమోదించనున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీ నిధులతో కార్యాలయం వెనుక భాగంలో రూ.15 లక్షలతో చిల్డ్రన్స్ పార్కు, మరో రూ.15 లక్షలతో కార్యాలయం చుట్టూ రోడ్ల నిర్మాణాలు, బ్యూటిఫికేషన్లు, రూ.40 లక్షలతో ఫర్నిచర్ సమకూర్చేందుకు సభ్యుల ఆమోదం తీసుకోనున్నట్లు కమిషనర్ వివరించారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి శనివారం ప్రారంభించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.18,116, ద్వితీయ బహుమతిగా రూ.12,116, తృతీయ బహుమతిగా రూ.7,116 అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, దుంపా యలమందారెడ్డి, అంబేడ్కర్ యూత్ ఫోర్స్ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందజేస్తున్న ఖాజావలి

నాగులుప్పలపాడు: పాలడుగు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న మ్యాచ్ బాల్ ఇన్విటేషన్ క్రికెట్ పోటీల మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో మొదటి మ్యాచ్ మనీ లెవన్ మద్దిపాడు – ఎస్‌హెచ్‌సీసీ ఒంగోలు జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన మనీ లెవన్ మద్దిపాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌హెచ్‌సీసీ ఒంగోలు జట్టు 101 పరుగులకు ఆలౌటవడంతో మనీ లెవన్ జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం రెండో మ్యాచ్ యునైటెడ్ విజయవాడ – హెచ్ఆర్ లెవన్ ఒంగోలు జట్ల మధ్య జరగ్గా, యునైటెడ్ విజయవాడ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యునైటెడ్ విజయవాడ జట్టు 18 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హెచ్ఆర్ లెవన్ జట్టు 15.3 ఓవర్లలో 84 పరుగుల వద్ద ఆలౌటైంది. ఈ రెండు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు షేక్.ఖాజావలి, పాలడుగు మురళీకృష్ణ దక్కించుకోగా, నిర్వాహకులు పాలడుగు రాజీవ్, సందీప్ అందజేశారు.

హిజ్రాలకు నైపుణ్యాభివృద్ధిలో ఉచిత శిక్షణ

ఒంగోలు: హిజ్రాల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వారికి నైపుణ్యాభివృద్ధిలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.అర్చన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్ డ్రైవింగ్, బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలోని హిజ్రాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం ఫోన్ నెంబర్ 08592–281310 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మంచినీటి ట్యాంకర్ల సంఖ్య పెంచాలి

ఒంగోలు టౌన్: నగర శివారు కాలనీలకు మంచినీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్ల సంఖ్య పెంచాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. శనివారం సుందరయ్యభవన్‌లో నిర్వహించిన సీపీఎం నగర కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. శివారు కాలనీలకు ఏడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. వేసవి కావడం వలన నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మూడు రోజులకోసారి నీరు సరఫరా చేయాలని కోరారు. శివారు కాలనీల్లో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ అన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు పరిశీలించిన సబ్ కలెక్టర్



రీ సర్వే పనులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తకోట పరిధిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పొలాలకు నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ శనివారం పరిశీలించారు. నంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు ప్రయత్నించాలన్నారు. తహసీల్దార్ కొమ్ము విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు ఉన్నారు.

వృషభరాజుల బలప్రదర్శన

పెద్దారవీడు: మండలంలో గొబ్బూరు గ్రామంలో ఉయ్యాల పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా 31వ తేదీ రాష్ట్రస్థాయి సీనియర్ ఒంగోలు జాతి వృషభరాజుల బలప్రదర్శన నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు బహుమతులుంటాయన్నారు. రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8688650549, 8464874149, 9390212844 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.